సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 12 । జూన్ । 2024



మిన్నంటిన సంబరం..
పోటెత్తిన భక్తజనం 8లో



భవిత కేంద్రం
సేవలు భేష్ 8లో



ప్రాణాలు తీసిన
ఈత సరదా 8లో

గంగమ్మకు నీరాజనం



గంగమ్మ తల్లి



ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి ఆలయం





గంగమ్మా కాపాడమ్మా: భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి పండగ
- మొక్కులు తీర్చుకున్న మహిళలు

మహారాణిపేట : మత్స్య సంపద వేట బాగుండాలని, వేటకు వెళ్లే మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని మత్స్యకార మహిళలు గంగమ్మ తల్లిని మొక్కుకున్నారు. మంగళవారం గంగమ్మ తల్లి పండగను మత్స్యకార మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మ తల్లి దేవాలయం వద్ద మహిళలు, మత్స్యకారులు మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. బిందెలు, కలశాలతో పసుపు, కుంకుమ కలిపిన నీటిని తీసుకొని వెళ్లి సముద్రంలో వేసి సముద్ర దేవతను పూజించారు. గంగమ్మ తల్లి కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. ఈనెల 14న అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీ. మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో దేవాలయం వద్ద పలు ఏర్పాట్లు చేశారు. మత్స్యకార సంఘాల నాయకులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన మత్స్యకారులు



శ్రీ గంగమ్మ దేవాలయం వద్ద పూజలు



ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మకు పూజలు



జెట్టిలో పసుపు, కుంకుమ కలిపిన నీరు సముద్రంలో పోసి పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

ఈఏపీసెట్‌లో మెరుపులు



అగ్రికల్చర్ విభాగంలో 8వ ర్యాంకు సాధించిన మనోభిరామ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



అగ్రికల్చర్ విభాగంలో 9వ ర్యాంకు సాధించిన పావనికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

- సత్తాచాటిన విశాఖ విద్యార్థులు
- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు

ఏపీ ఈఏపీసెట్‌లో విశాఖ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల కాగా ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ విభాగంలో ఎం.బాలాదిత్య 13వ ర్యాంక్, రెడ్డి అనిల్ 30వ ర్యాంక్, తోట ధీరజేశ్వర్ 43వ ర్యాంక్, ధనుకొండ శ్రీనిధి 55వ ర్యాంక్, ఇనపకుర్తి రాజేష్ 60వ ర్యాంక్, బుద్ధ తన్మయ్ 70వ ర్యాంక్ సాధించారు. అలాగే అగ్రికల్చర్ విభాగంలో మనోభిరామ్ 8వ ర్యాంక్, పావని 9వ ర్యాంక్, సూర్య చరణ్ 49వ ర్యాంక్, ఫణికుమార్ 59వ ర్యాంక్, జై కిశోర్ 89వ ర్యాంక్ సాధించారు.



ఎం.బాలాదిత్య
13వ ర్యాంక్



రెడ్డి అనిల్
30వ ర్యాంక్



తోట ధీరజేశ్వర్
43వ ర్యాంక్



ధనుకొండ శ్రీనిధి
55వ ర్యాంక్



సూర్య చరణ్
49వ ర్యాంక్



జై కిశోర్
89వ ర్యాంక్



ఇనపకుర్తి రాజేష్
60వ ర్యాంక్



బుద్ధ తన్మయ్
70వ ర్యాంక్

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జస్మీట్ సింగ్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్మీట్ సింగ్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి రేడియో థెరపీ యంత్ర సామగ్రి



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించాలనే సత్సంకల్పంతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఉదారతను చాటుకుంది. సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్)లో భాగంగా హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన సంస్థకు రూ.34.62 కోట్ల విలువైన రేడియో థెరపీ యంత్ర సామగ్రి రింగ్ బేస్డ్ లీనర్ ఆక్సిలేటర్(లినాక్)ని అందించింది. ఈ మేరకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధి సూర్యచంద్రరావు, క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతిశెట్టి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ పవర్ గ్రిడ్ సంస్థ సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా క్యాన్సర్ రోగులకు మెరుగైన, అధునాత పద్ధతిలో సేవలు అందించే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. మహంతి శెట్టి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూడా క్యాన్సర్ రోగులు తమ ఆస్పత్రి సేవలు పొందుతున్నట్లు వెల్లడించారు.

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మీంం పాలెం : జీవీఎంసీ 8వ వార్డులోని విశాఖ అంధుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. 2014–25 సంవత్సరానికి గాను ఉత్తరాంధ్రలోని 5 నుంచి 20 ఏళ్ల వయసు గల అంధ బాలబాలికలు అర్హులని పేర్కొంది. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత విద్య, భోజనం, వసతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం కల్పించనుంది. వివరాలకు 99895 62498,92472 36898 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

హంతకుడికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: ఆస్తి వివాదంలో మేనల్లుడిని హతమార్చిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.10 లక్షల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా సొమ్ములో రూ.9.5 లక్షలు బాధిత కుటుంబానికి ఇవ్వాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాంద్రేగుల జగదీశ్వర్ రావు అందించిన వివరాలు.. నిందితుడు పైల రమణ ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందినవాడు. మృతుడు సుర్ల వెంకటరమణ పైల రమణకు మేనల్లుడు. ఇద్దరు ఒకే గ్రామంలో ఉంటున్నారు. వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆస్తి కోసం తరచూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో 2014 అక్టోబరు 25వ తేదీన వెంకటరమణ సమీపంలోని సంతకు వెళ్లాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో నిందితుడు పైల రమణ కాపుకాచి వెంకటరమణపై ఇటుకలు, బండరాళ్లతో దాడి చేశాడు.

తీవ్ర గాయాల మధ్య వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాతవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 302 సెక్షన్ కింద నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–బల్హార్షా సెక్షన్, అసిఫాబాద్–రెచిని స్టేషన్ల మధ్య జరుగుతున్న 3వ లైన్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో దారి మళ్లించనున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్ల వయా విశాఖపట్నం–దువ్వాడ–విజయవాడ–వరంగల్–బల్హార్షా మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం–రాయగడ–టిట్లాగడ్–రాయ్‌పూర్–నాగ్‌పూర్ మీదుగా నడుస్తాయన్నారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని కోరారు.

దారి మళ్లించిన రైళ్లు

- విశాఖపట్నం–న్యూఢిల్లీ–విశాఖపట్నం(20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్‌లు జూన్ 22 నుంచి జూలై 5 వరకు
- విశాఖపట్నం–గాంధీధామ్(20803) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 27, జూలై 5 తేదీల్లో
- గాంధీధామ్–విశాఖపట్నం(20804) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లో
- విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్(12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ జూన్ 24, 28, జూలై 1, 5 తేదీల్లో
- హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 26, 30, జూలై 3వ తేదీల్లో
- పూరి–ఓఖా(20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లో
- ఓఖా–పూరి(20820) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 26, 30 తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

ఫిట్ 'లెస్'!

- జిల్లాల్లో సుమారు 1,400 స్కూలు బస్సులు
- ఇప్పటి వరకు 1,089 బస్సులకు ఫిట్‌నెస్
- ఫిట్‌నెస్ లేని బస్సులు తిరిగితే సీజ్
- రేపు బడులు తెరుచుకోనుండడంతో ముగియనున్న గడువు
- నెలాఖరు వరకు రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్





బస్సు ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : పాఠశాలలు తెరుచుకునే సమయం ఆసన్నమైనప్పటికీ ఇంకా బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడానికి సంబంధిత యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. వేసవి సెలవుల అనంతరం ఈ ఏడాది జూన్ 13 నుంచి స్కూళ్లు తిరిగి తెరుచుకుంటున్నాయి. ఆయా పాఠశాలలు బడి పిల్లల కోసం నడిపే బస్సులు పాఠశాలల ప్రారంభానికి ముందే ఫిట్‌నెస్ పరీక్షలు జరిపించుకోవలసి ఉంటుంది. ఆ పరీక్షలో స్కూలు బస్సు కండిషన్ బాగుందని రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అలా ఆ సర్టిఫికెట్ పొందిన బస్సును మాత్రమే రోడ్లపై తిరగడానికి అనుమతిస్తారు. అవి లేని బస్సులను తిప్పడానికి వీల్లేదు. జూన్ 12 నాటికల్లా సదరు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు వేసవి సెలవుల్లోనే సమాచారం ఇచ్చారు. వారితో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. అంతేకాదు స్కూలు బస్సు డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని, 50 ఏళ్ల లోపు వయసుండాలని వివరించారు. అలాగే బడి పిల్లలను ఎక్కించుకోవడానికి, దించడానికి ఆ బస్సులో ఒక సహాయకుడు కూడా తప్పనిసరని, డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడో లేదో తెలుసుకునేందుకు బ్రీత్ అనలైజర్ పరీక్షించాకే బస్సు నడపడానికి అనుమతించాలని స్పష్టం చేశారు.

1,089 బస్సులకే ఫిట్‌నెస్

జిల్లాలో సుమారు 1,400 వరకు స్కూలు/కాలేజీ బస్సులున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 1,089 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయి. దీంతో వీటికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఓసీలు) జారీ చేశారు. ఇంకా 300కు పైగా బస్సులు అంటే దాదాపు నాలుగో వంతు ఫిట్‌నెస్ పరీక్షలకు దూరంగా ఉన్నాయి. బడులు తెరవడానికి ఇంకా కేవలం ఒక్కరోజు మాత్రమే ఉంది. బుధవారంతో బస్సులకు ఇచ్చిన ఫిట్‌నెస్ చేయించుకునే గడువు ముగిసింది. ఆ తర్వాత ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోని బస్సులను రవాణా శాఖ అధికారులు అనుమతించరు. మరోవైపు స్కూలు పిల్లలను తీసుకెళ్లే ఆటోలు కూడా ఆరుగురికి మించి తీసుకెళ్లడానికి వీల్లేదు. అలా పరిమితికి మించి తీసుకెళ్తే చర్యలు తీసుకుంటారు.

ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సుల సీజ్

జిల్లాలో ఇప్పటి వరకు 1,089 బడి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశాం. గురువారం నుంచి పాఠశాలలు తిరిగి తెరుచుకుంటున్నందున ఆ రోజు నుంచి నెలాఖరు వరకు స్కూలు బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని స్కూలు, కాలేజీ బస్సులను సీజ్ చేస్తాం. సంబంధిత పాఠశాల/ కళాశాల యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకుంటాం. అందువల్ల ఆర్టీఏ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సులను మాత్రమే నడపాలని యాజమాన్యాలకు స్పష్టం చేస్తున్నాం.

– జీసీ రాజారత్నం,
ఉప కమిషనర్, రవాణాశాఖ

17 నుంచి సత్యదేవుని దివ్య కల్యాణోత్సవాలు

- 18న స్వామి కల్యాణం
- విశేష పూజలు, సామూహిక వ్రతాలు, శ్రీపుష్పయాగం
- ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు



ఇసుకకొండపై వెలసిన స్వామి ఆలయం

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు దివ్య కల్యాణోత్సవాలు జరపనున్నారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కల్యాణోత్సవాలు ప్రారంభించనున్నారు. అనంతరం ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుయోగీశ్వర మండలారాధన, అగ్ని ప్రతిష్టాపన, హోమాలు నిర్వహించనున్నారు. 18వ తేదీ ఉదయం 6 గంటలకు నిత్య హోమం, వైనతేయ ప్రతిష్ట, ధ్వజారోహణం నిర్వహించనున్నారు. 8 గంటలకు విశేష హోమాలు జరపనున్నారు. 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 11 గంటలకు ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరపనున్నారు. 19న ఉదయం 6 గంటలకు నిత్యారాధన, బాలభోగం, శాత్తుమురై సేవాకాలం, 8 గంటలకు యాగశాలార్చన, విశేష హోమాలు, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి తిరువీధి రథోత్సవం జరపనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దేవాలయ నూతన ఘాట్ రోడ్డు నుంచి బయలుదేరి పూర్ణామార్కెట్ జంక్షన్, దుర్గాలమ్మ గుడి, జగదాంబ సెంటర్ మీదుగా పూర్ణామార్కెట్ ఘాట్‌రోడ్డు మీదుగా దేవాలయం వరకు రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. 20వ తేదీ ఉదయం 6 గంటలకు నిత్యారాధన, బాలభోగం, 8 గంటలకు యాగశాలార్చన, విశేష హోమాలు, ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) ఏర్పాటు చేశారు. 21న ఉదయం నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు విశేష హోమాలు, 7 గంటలకు డోపోత్సవం (తిరుమంగైయయ్యాళ్వార్ కై ంకర్యం)తో పాటు 22న జ్యేష్ఠపౌర్ణమి పురస్కరించుకొని ఆ రోజు వేకువజాము 2 గంటల నుంచి 4 గంటల వరకు నిత్య పూజలు, హోమాలు జరపనున్నారు. దయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక వ్రతాలు, 12 గంటల నుంచి అన్నసమారాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం, చక్రస్నానం నిర్వహించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి చక్రాబ్జ మండలారాధన, ద్వాదశారాధన, సప్తావరణోత్సవం, శ్రీపుష్పయాగం పవళింపు సేవ వైభవంగా నిర్వహించనున్నారు.

18న స్వామి కల్యాణం

సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 18న నిర్వహించనున్న స్వామి కల్యాణమహోత్సవంలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

స్వామి వ్రతం..

ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, పౌర్ణమిరోజు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు నిరంతరాయంగా స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. వ్రతం చేయించుకునే భక్తులు రెండు కొబ్బరికాయలు, అరడజన్ అరటిపండ్లు, విడి పువ్వులు తెచ్చుకోవాలి. పూజా సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుంది. పూజా రుసుం రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం చేయించుకోదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పౌర్ణమి రోజున ప్రత్యేకంగా ధ్వజస్తంభ ప్రదక్షణ ఉంటుంది.

ఆలయం తెరుచు వేళలు..

రోజూ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు, పౌర్ణమి రోజు ఉదయం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా ఉంటుంది. మహానివేదన ఉదయం 11.40 నుంచి 12 గంటల వరకు.

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సొబగులు



కలెక్టరేట్‌కు విద్యుత్ కాంతులు



ధగధగలాడుతున్న వీఎంఆర్‌డీఏ కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనుండటంతో మంగళవారం రంగు రంగుల విద్యుత్ దీపాలతో కలెక్టర్ కార్యాలయాన్ని అలంకరించారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ముఖ్య అధికార కార్యాలయాలన్నీ విద్యుత్ వెలుగులతో దగదగలాడుతున్నాయి. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, జిల్లా పరిషత్, డ్వామా, అన్ని తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ అధికారుల కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పిరమిట్లుగొలిపేలా విద్యుత్ కాంతిని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించరాదు

ఆరిలోవ: ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించరాదని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు(జేడీ) డాక్టర్ డి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం అక్రమ పశు వధ, అక్రమ జంతు రవాణా చేయకూడదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటర్ యాక్ట్ 1977 అండ్ ట్రాన్స్‌పోర్టు ఆఫ్ యానిమల్ రూల్స్ 1978, 2001 ప్రకారం జంతు సంక్షేమ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై జిల్లాలో పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి చారించాలని ఆదేశించారు.

స్నేహితుడి హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

మద్రిపాలెం: స్నేహితుడ్ని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. ఐటీఐ జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజామున మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఉదయ్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. హత్యచేసిన యువకుడు హేమంత్, సహకరించిన సాయికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరిని మంగళవారం ఉదయం కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించడంతో అడవివరంలోని సెంట్రల్ జైలుకు తరలించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.120
బ్రాయిలర్ (లైవ్)	: రూ.140
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	530.00
విజయనగరం	534.00
శ్రీకాకుళం	534.00

ఈఏపీసెట్‌లో మెరిసిన విశాఖ

ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మెరిశారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కళాశాలల విద్యార్థులు సత్తాచాటుకున్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ విభాగాల్లో ర్యాంకులు సాధించి విశాఖకు వన్నెతెచ్చారు.

తిరుగులేని 'తిరుమల'

తగరపువలస: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు లభించాయని చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో పి.రాహుల్ 79వ ర్యాంకు, టి.శశాంక్ 191, టి.ఉమాసాయి దీపక్ 218, కె.శ్రీసాయి మహి ప్రణీత్ 221, జి.హిమాచల్ 226వ ర్యాంకులు సాధించారు. వందలోపు ర్యాంకు ఒకరు, 200 లోపు ఇద్దరు, 500లోపు 11 మంది, వెయ్యిలోపు 25, 1500లోపు 45, 2 వేలలోపు 71, 5 వేల లోపు 175, 10వేల లోపు 301, 15వేల లోపు 385, 20వేలలోపు 453, 25వేలలోపు 503 మంది ర్యాంకులు సాధించారన్నారు. అలాగే అగ్రికల్చరల్ విభాగంలో కె.శ్రీవిద్య 139వ ర్యాంకు, వై.మురళి 203, జి.శివాని 310, ఇ.సాయి తేజశ్రీ 400, కె.హర్షిణి 500వ ర్యాంకులు సాధించారు. 200లోపు ఒకరు, 500లోపు ఐదుగురు, వెయ్యిలోపు 10, 1500లోపు 11, 2వేలలోపు 14, 5వేలలోపు 25, 10వేల లోపు 40, 15వేలలోపు 57, 20వేలలోపు 68, 25వేలలోపు 75 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని రెసిడెంట్ డైరెక్టర్లు కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ఇ.మృత్యుంజయరావు, జి.సతీష్‌బాబు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల యాజమాన్యం

'నారాయణ' విజయకేతనం

సీతమ్మధార: ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు మరోసారి విజయకేతనం ఎగురవేసినట్టు సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వర రావు తెలిపారు. ఆశీలమెట్టలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో 100లోపు విశాఖ నారాయణ విద్యార్థులు మచ్చా బాలాదిత్య 13వ ర్యాంకు, మజ్జి రిషివర్ధన్ 63, చింటూ సతీష్‌కుమార్ 81, అల్లు హేమంత్ 82, గొర్లె పవన్‌కుమార్ 89, పిల్లా సృజన కుమార్ 89, పిల్లా సృజన నారాయణ 93వ ర్యాంకు సాధించారు. 500లోపు 23 ర్యాంకులు, వెయ్యిలోపు 34 ర్యాంకులు సాధించినట్లు వారు తెలిపారు.

అగ్రికల్చర్ విభాగంలో...

అగ్రికల్చర్ విభాగంలో వందలోపు విశాఖ నారాయణ విద్యార్థులు సూర్య చరణ్ దేశిన 49వ ర్యాంకు, జై కిశోర్ గరుగుబిల్లి 89వ ర్యాంకు సాధించారు. వెయ్యిలోపు 13 ర్యాంకులు సాధించి ఉత్తరాంధ్రలోనే మరోసారి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నామని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వర రావు తెలిపారు. ఈ ర్యాంకులు సాధించడం వెనుక అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డీజీఎం హనుమంతరావు

శ్రీచైతన్య విజయ దుందుభి



ఉత్తమ ఫలితాల సాధించిన శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మద్దిలపాలెం/ఉక్కునగరం: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం మంగళవారం అభినందించింది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 100లోపు 11 మంది ర్యాంకులు సాధించారు. అగ్రి, ఫార్మా స్ట్రీమ్‌లో 100లోపు 8 మంది ర్యాంకులు సాధించారు.

ఆ కుటుంబాల్లో ఆనందం

స్టీల్‌ప్లాంట్‌కు చెందిన మనోభిరామ్ అగ్రికల్చర్‌లో 8వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంబంగి నాగభూషణరావు (ప్రైవేటు ఉద్యోగి), దాక్షాయని ఆనందంతో ఉప్పొంగిపోయారు. మిఠాయిలు తినిపించి ఆనందం పంచుకున్నారు. అలాగే గంగవరం పోర్టు ఉద్యోగి శరగడం నాగగంగారావు, లావణ్య దంపతుల కుమార్తె పావని 9వ ర్యాంకు సాధించడంతో ఆ కుటుంబం మిఠాయిలు పంచి సంతోషం పంచుకున్నారు.

ఎసెంట్ విజయకేతనం



గౌతమ్, 289వ ర్యాంకు

మద్దిలపాలెం: ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాల్లో ఎసెంట్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్ ఎంవీఆర్ మురళీకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. కళాశాలకు చెందిన ఐ.గంగా భవాని రాష్ట్ర స్థాయి 109వ ర్యాంకు, అల్లా గౌతమ్ 289వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో గంగాభవానిని మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన 32 మంది విద్యార్థులు 2వేలలోపు ర్యాంకులు సాధించారన్నారు. ఎసెంట్ మెడికల్ అకాడమి విద్యార్థులు 109,110, 175, 237,289,366, 442, 544, 635, 648, 649, 650, 686,681, 699,823,849, 863, 867,884, 955, 985 ర్యాంకులు సాధించారన్నారు. అకాడమీ నుంచి 140 మంది హాజరుకాగా 140 మంది ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. గౌతమ్‌ను అకాడమీ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు అభినందించారు.



గంగాభవానిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్

'శ్రీవిశ్వ' ప్రభంజనం

సీతంపేట: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక ర్యాంకులతో జయకేతనం ఎగురవేశారు. ఎం.స్రవంతి 246 ర్యాంకు, ఎన్.హరికృష్ణ 259, ఎస్.గీతా చంద్రిక 289, వై.శృతి 314, ఎం.భవ్య సంజన శ్రీ 359, ఎం.యశస్వి 378 ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు 509, 582, 583, 660, 658, 661, 720, 727, 749, 779, 805, 828, 852, 902, 966, 974 ర్యాంకులు సాధించగా, 500లోపు 6 ర్యాంకులు, వెయ్యిలోపు 24 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపక సిబ్బందిని శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీవిశ్వ చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ సూర్యనారాయణ

ఇద్దరూ ఇద్దరే..

గోపాలపట్నం: ఏపీ ఈఏపీసెట్ గోపాలపట్నం ప్రాంత విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం నరసింహ నగర్‌కు చెందిన రెడ్డి అనీల్ 34వ ర్యాంక్ సాధించగా, అదేవార్డులో వెంకటాపురానికి చెందిన బుద్ధ తన్మయ్ 70వ ర్యాంక్ సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కూడా రెడ్డి అనీల్ 185వ ర్యాంకు సాధించగ తన్మయ్ 779వ ర్యాంకు సాధించారు. అనిల్ తండ్రి వెంకట సత్యసాయి నాయుడు డిఫెన్స్‌లో సివిలియన్‌గా పని చేస్తుండగా తల్లి పద్మ గృహిణి. సాఫ్ట్‌వేర్‌లో ఇంజినీర్‌గా స్థిరపడాలన్నదే తన ఆకాంక్ష అని అనిల్ చెప్పాడు. తన్మయ్ తల్లిదండ్రులు గోవిందరావు, భూదేవి అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. అధ్యాప కులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉత్తమ ర్యాంకు సాధించానని, తాను కంప్యూటర్ పరిశోధకుడిగా స్థిరపడాలనుకుంటున్నాని చెప్పాడు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడతా



సీతంపేట శాంతిపురంలో ఉంటున్నాం. 12వ తరగతి సీబీఎస్‌ఈలో 96 పర్సంటేజ్ సాధించాను. ఏపీ ఈఏపీసెట్‌లో 224వ ర్యాంకు వచ్చింది. అలాగే జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకు 2121, ఓబీసీ ర్యాంకు 371, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా ర్యాంకు 2516, ఓబీసీ ర్యాంకు 430 సాధించాను. ఖరగ్‌పూర్ గానీ, రూర్కీ ఐఐటీలలో కంప్యూటర్ సైన్స్ చేసి మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలనుకుంటున్నా. నాన్న పి. వెంకట కృష్ణమూర్తి ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అమ్మ కృష్ణవేణి గృహిణి.

– పొన్నగంటి సాయి దేవ చరణ్, శాంతిపురం, సీతంపేట

కంప్యూటర్ ఇంజినీర్ అవుతా

ఐఐటీ చెన్నైలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఇంజినీర్ కావాలనేది నా ఆకాంక్ష. ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదివాను. తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రోత్సాహంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 645వ ర్యాంక్ సాధించగలిగాను. ఏపీ ఈఏపీసెట్‌లో 43వ ర్యాంకు సాధించా. ఐఐటీ చెన్నైలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేస్తాను. నాన్న సూర్యనారాయణ పరవాడలోని ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి.

–తోటా ధీరజేశ్వర్, 43వ ర్యాంకర్



ఎస్ఐను దూషించిన ఘటనపై కేసు

అక్కిరెడ్డిపాలెం: డ్రంక్ అండ్ డ్రైవ్ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐను తండ్రి, కొడుకు దూషించడంతో కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్ విధుల్లో భాగంగా కణితి రోడ్డు మోర్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో గాజువాకకు చెందిన యువకుడు సంపర సాయి సూర్య, తండ్రి సంపర మురళీకృష్ణలు బైక్‌పై కణితి వైపు వెళ్తున్నారు. వీరిని ఎస్ఐ ఆపి వాహనం నడుపుతున్న కుమారుడ్ని డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేశారు. కుమారుడు మద్యం మత్తులో ఉండటంతో వారిపై కేసుకు ఉపక్రమిస్తున్నారు. ఈ సమయంలో తండ్రి ఎస్ఐతో వాగ్వాదానికి దిగి విధులకు తీవ్ర ఆటంకం కల్పించడంతో పాటు ఎస్ఐను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో వారిపై ఎస్ఐ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తండ్రి, కొడుకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిత కేంద్రం సేవలు భేష్

అగనంపూడి: వడ్లపూడిలోని భవిత కేంద్రంలో అందుతున్న సేవలు ప్రశంసనీయమని భవిత కేంద్రం రాష్ట్ర అధికారి ఎస్.కల్పన అన్నారు. గాజువాక మండలం వడ్లపూడిలోని భవిత కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. భవిత కేంద్రం, ఫిజియోథెరపీ కేంద్రం, ఇంద్రియ వనంను పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ద్వారా ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డిగ్రీలో చేర్పించాలన్నారు. బాలలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సర్వశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ గీతా, సీఎంవో అప్పలనాయుడు, ఎమ్మీవోలు సునీత, విశ్వనాథమ్, రిసోర్స్ పర్సన్లు ఉమాదేవి, అనుపమ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- తెరువుపల్లి మైనర్ శారదా నది వద్ద ఘటన
- ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి
- మృతులు బావ బావమరుదులు

యలమంచిలి: వారిద్దరూ బావ బావమరుదులు. వయసులో నాలుగేళ్ల వ్యత్యాసం ఉన్నా.. బంధుత్వానికి మించిన స్నేహం వారిది. ఒకరు ఐటీఐ తర్వాత అప్రెంటిషిప్ పూర్తి చేసి ఉపాధి వేటలో ఉండగా, మరొకరు ఎంసెట్ పరీక్ష రాసి, ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి సెలవులను ఆనందంగా గడపటానికి అమ్మమ్మగారి ఇంటికి వచ్చి బావతో కలిసి సరదాగా మైనర్ శారదా నదిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లి ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపిన వివరాలు.

రాంబిల్లి మండలం దిమిలి ఎస్సీ కాలనీకి చెందిన యర్రంశెట్టి శ్రీను(22), గాజువాకకు చెందిన బంగారి జగన్(18)లు బావబావమరుదులు. జగన్ ఇంటర్ పాసై ఎంసెట్ పరీక్ష రాశాడు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. సెలవుల్లో తన అమ్మమ్మగారింటికి ఆనందంగా గడిపేందుకు వచ్చాడు. మంగళవారం తన బావ శ్రీనుతో కలిసి తెరువుపల్లి సమీపంలోని మైనర్ శారదా నది వద్దనున్న చిన్న ఆనకట్ట వద్దకు ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. దీంతో ఈత రాని జగన్ నీటి ప్రవాహంలో మునిగిపోతుండగా, పక్కనే ఉన్న శ్రీను రక్షించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇరువురూ ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. అటుగా వెళ్తున్న ఉపాధి హామీ కూలీలు గుర్తించి వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే జగన్ మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శ్రీనును దిమిలి పీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీను ఐటీఐ తర్వాత అప్రెంటీస్ చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. మృతులిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



మృతులు శ్రీను, జగన్

బాధితుల్ని ఓదార్చేందుకు, మృతదేహాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మృతులు జగన్, శ్రీను తండ్రులు యర్రంశెట్టి అప్పారావు, బంగారి అప్పారావులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టంనకు యలమంచిలి తరలించినట్లు సీఐ గఫూర్, ఎస్ఐ సింహాచలం వెల్లడించారు.

చేతికి అంది వస్తారనుకుంటే..

చేతికి అందివస్తారనుకున్న బిడ్డలు నీటి మునిగి చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు, బంధువుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. 'ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా.. ముందుగా వెళ్లి సాయపడేదాన్ని, అలాంటి నా ఒక్కగానొక్క కొడుకు ప్రాణాలు కాపాడుకోలేకపోయాను దేవుడా'.. అంటూ శ్రీను తల్లి రోదన స్థానికుల్ని కంటతడి పెట్టించింది. స్నేహితులతో ఆప్యాయంగా తిరుగాడే శ్రీను మరణం పట్ల ఎస్సీ కాలనీ యువకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మిన్నంటిన సంబరం.. పోటెత్తిన భక్తజనం

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలకు భక్తజనం పోటెత్తారు. మోదకొండమ్మతల్లి కరుణించమ్మా అంటూ పూజలు చేశారు. ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముగింపు ఉత్సవాలకు భారీగా తరలిరావడంతో పాడేరు జనసంద్రాన్ని తలపించింది. అమ్మవారికి ఐటీడీఏ పట్టు వస్త్రాలు సమర్పించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



మోదకొండమ్మ అమ్మవారు

- ఘనంగా ముగిసిన మోదకొండమ్మ ఉత్సవాలు
- తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి భారీగా భక్తుల రాక
- కిక్కిరిసిన పాడేరు
- ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఐటీడీఏ
- పోలీసుల భారీ బందోబస్తు

సాక్షి,పాడేరు: గిరిజనుల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. చివరి రోజు జాతరకు భారీగా రావడంతో పాడేరు రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఉత్సవాల మూడోరోజు కూడా అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి భక్తులు పోటెత్తారు. కలెక్టర్ ఎం.విజయసునీత, జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నర్సింగరావు పూజలు జరిపారు. ఐటీడీఏ తరఫున పీవో అభిషేక్ మోదమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఇంటి పండగలతో సందడి

అమ్మవారి ఉత్సవాల చివరిరోజు కావడంతో భక్తులంతా ఇంటి పండగలు జరుపుకున్నారు. అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ కుటుంబ సభ్యులతో కలిసి మోదమ్మకు మట్టి ఘటాలను సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతో పాటు మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి మట్టి, ఇత్తడి ఘటాలు సమర్పించారు. భారీగా తరలిరావడంతో మధ్యాహ్నం రెండు గంటల వరకు అమ్మవారి ఆలయం రద్దీ కొనసాగింది.



చివరి రోజు జాతరతో భక్తుల రద్దీతో పాడేరు మెయిన్‌రోడ్డు



బాణసంచా కాలుస్తున్న కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్

ఘనంగా ఊరేగింపు

ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారి ఊరేగింపు సాయంత్రం నుంచి రాత్రి వరకు అత్యంత వైభవంగా నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన సతకం పట్టు వద్ద మూడు రోజుల నుంచి పూజలు అందుకుంటున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలకు కలెక్టర్ విజయ సునీత, జేసీ భావన వశిష్ట, పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గిడ్డి ఈశ్వరి,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, కె.వెంకటరమణ, టి.ప్రసాద్‌నాయుడు, వై.శ్రీనివాసరావు కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు బయటకు తీసుకువచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సంబరాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహాలను మోసేందుకు భక్తులు బారులు తీరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శక్తివేషాలు, గరగల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు ఊరేగింపు జరిగింది. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ప్రధాన ఆలయానికి తీసుకువెళ్లడంతో ఉత్సవాలు ముగిశాయి. పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



ఉత్సవ విగ్రహాన్ని మోస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు